
సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 16 । డిసెంబర్ । 2024



ధనుర్మాసం.. భక్తిమార్గం
ధనుర్మాసంలో విష్ణు ఆలయాల్లో నెల రోజుల పాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. ఈ మాసంలో విష్ణుమూర్తిని మధుసూదనుడిగా పూజిస్తారు. - 8లో



ప్రమాదంలో మౌలిక మానవ విలువలు
స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మౌలిక మానవ విలువలు నేడు ప్రమాదంలో పడ్డాయని పౌరహక్కుల ఉద్యమ నేత హరగోపాల్ పేర్కొన్నారు. - 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
29.0 /21.6

జిల్లాలో ఆదివారం 21.6 - 29.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

అమరజీవి త్యాగం.. ఆదర్శనీయం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో, అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం కోసం చేసిన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం.. అందరికీ ఆదర్శనీయమని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఆర్వోతోపాటు కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి, చివరికి ప్రాణాలర్పించి అమరజీవిగా మారారన్నారు. దేశంలోని భాషా ప్రయుక్త రాష్ట్రాలకు అశేష స్ఫూర్తిగా నిలిచిన ఆయన మన తెలుగు వారని చెప్పుకోవడం గర్వకారణం అన్నారు. కార్యక్రమానికి ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అధికారులు, సంక్షేమ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్చరీ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ జట్టు ఎంపిక ఉత్సాహంగా సాగింది. ఈ ఎంపికను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి తేజ, క్రీడాపాఠశాల ఆర్చరీ శిక్షకుడు రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. రికర్వ్ రౌండ్, ఇండియన్ రౌండ్, కాంపౌండ్ రౌండ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించి జిల్లా జట్టును ప్రకటించారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు
ఇండియన్ రౌండ్ : శివదుర్గ, సుశ్రుత, బి.బిందుమాధవి, ఆర్.శ్రీనివాసులు, సి. దినేష్‌కుమార్, ఎస్.శశివర్ధన్, ఎల్.కౌశల్‌దేవరాయల్, ఎ.యశ్వంత్, టి.గణేష్
రికర్వ్ రౌండ్ : వై.నవనీష్
కాంపౌండ్ రౌండ్ : పి.వి.శ్రీనివాస్

నూతన కార్యవర్గం



ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా ఆదివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన గోవిందు రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కాజ రాజకుమార్, సహాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు (గుంటూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.శ్రీనివాసరావు (ఎన్టీఆర్), కోశాధికారిగా ఎల్వీ యుగంధర్ (విజయనగరం)తోపాటు ఏడుగురు ఉపాధ్యక్షులు, ఏడుగురు కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఖజాన ఉద్యోగులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి హక్కుల సాధన కోసం పాటుపడాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వారు నిర్ణయించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

కడప అర్బన్ : జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు 7538 కేసులు పరిష్కరించారు. వీటి ద్వారా కక్షిదారులకు రూ.30,62,35,14,826 నష్టపరిహారంగా చెల్లించారు. జిల్లా వ్యాప్తంగా 7104 క్రిమినల్, 262 సివిల్, 172 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారం అయ్యాయి. కడపలో 2689, ప్రొద్దుటూరు 1839, రాజంపేట 512, రాయచోటి 130, బద్వేలు 253, జమ్మలమడుగు 1058, సిద్దవటం 100, రైల్వేకోడూరు 185, పులివెందుల 320, నందలూరు 211, లక్కిరెడ్డిపల్లె 83, కమలాపురంలో 158 కేసులు పరిష్కరించారు. కేసుల పరిష్కారానికి సహకరించిన అధికారులకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

దీపం.. మోసం

ఎన్నికల మ్యానిఫెస్టోలో కూటమి 'ఇంటింటికీ ఉచిత గ్యాస్' అని గొప్పగా ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేయడం ప్రారంభించింది. దీపం-2 కింద దీపావళి కానుకగా తీసుకొచ్చిన ఈ పథకం.. ఉత్త గ్యాస్‌గా మారింది. అర్హుల పేరుతో కొందరినే లబ్ధిదారుల జాబితాలో చేర్చింది. చివరికి వారిలో కొంత మందికే డబ్బు పడటంతో.. మిగతా వారు లబోదిబోమంటున్నారు.

- కొందరికే ఉచిత గ్యాస్
- అనర్హుల పేరుతో ఎగనామం
- సబ్సిడీ డబ్బు అందజేతలోనూ జాప్యం
- ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు



జిల్లా సమాచారం

నియోజకవర్గం	రేషన్‌కార్డులు	దీపం లబ్ధిదారులు
జమ్మలమడుగు	87189	64391
బద్వేలు	82239	59896
కడప	83791	51943
కమలాపురం	69524	51484
మైదుకూరు	79918	61340
పులివెందుల	82809	64477
ప్రొద్దుటూరు	79993	59844
మొత్తం	5,64,863	4,13,375

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు కలిగిన లబ్ధిదారులందరికీ ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా లబ్ధిదారులు మొదట సొంత డబ్బులు కట్టి సిలిండర్లు దించుకున్న తర్వాత.. మూడు రోజులకు వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని తెలిపింది. తర్వాత కొన్ని రోజులకు ఇంకో మెలిక పెట్టారు. మొదటి ఐదు నెలల్లోపు తొలి సిలిండర్ కోసం బుక్ చేసుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రకటించారు.

కొందరికే డబ్బు
ఉచిత సిలిండర్‌లు వస్తాయనే ఆశతో లబ్ధిదారులు బుక్ చేశారు. డబ్బు కట్టి, సిలిండర్‌లు తీసుకున్నారు. వారం కాదు.. నెల గడుస్తున్నా.. వారి ఖాతాలో డబ్బు జమ కాలేదు. దీంతో గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఏజెన్సీలు మాత్రం తమకు ఇచ్చిన లిస్టులో ఉన్న వారికి మాత్రమే డబ్బులు పడుతాయని, మిగతా వారికి ఎందుకు పడలేదనే విషయాన్ని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి తెలుసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. నిత్యం పట్టణంలో భారత్ గ్యాస్, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల వద్దకు ప్రజలు పరుగులు తీస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లి విచారణ చేస్తే.. మీ పేరు లబ్ధిదారుల జాబితాలో లేదని చెబుతుండటంతో అవాక్కవుతున్నారు. గతంలో తమకు గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడుతూ వచ్చాయని, ఇప్పుడు దీపం పథకం జాబితాలో లేదనడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలలు గడుస్తున్నా..
జిల్లా వ్యాప్తంగా 5,64,863 రేషన్ కార్డులు ఉన్నాయి. దీపం పథకం కింద 4,13,375 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. లక్షా 50 వేల మందికి ఈ పథకం వర్తించడం లేదు. ఉచిత గ్యాస్ సిలిండర్‌లు బుక్ చేసి, నెలలు గడుస్తున్నా తమకు డబ్బులు పడటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచనలు ఇస్తున్నారు. ఈకేవైసీ చేయించుకోవడం కోసం పోస్టాఫీసులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతి కింద పని చేస్తున్న ఉద్యోగులను ఈ పథకానికి అనర్హులుగా ప్రకటించారు. కేవలం పది వేల జీతంతో పని చేస్తున్న తమకు ఈ పథకాన్ని వర్తింప చేయడం పోవడం దారుణమని వారు వాపోతున్నారు.

ఇంటింటికీ అని నమ్మించి..
ఎన్నికల్లో ఓట్లే పరమావధిగా కూటమి నాయకులు.. ప్రతి ఇంటికీ ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత.. నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేశారు. ఓట్లు వేయించుకునేందుకు ఎలాంటి అడ్డంకులు విధించని వారు.. ఉచిత గ్యాస్ పథకం పొందాలంటే అర్హత ఉండాలనే మెలిక పెట్టారు. రేషన్ కార్డు ఉన్న వారికే వర్తిస్తుందంటూ షరతు విధించారు. రేషన్ కార్డు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ ఉంటే అందిస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలోని 5,64,863 రేషన్ కార్డుదారులు తమకు పూర్తిగా గ్యాస్ రాయితీ వస్తుందని ఆశపడ్డారు. వీరంతా బీపీఎల్ కింద నమోదైన వారే. అయితే పథకాన్ని ప్రారంభించిన తర్వాత 4,13,375 కుటుంబాలకు నిరాశ ఎదురైంది. ఏళ్ల తరబడి గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు ఉన్నా.. అనర్హులుగా తేల్చడంతో వారు నివ్వెరపోతున్నారు. ఏ ప్రమాణాల ప్రకారం వీరిని అనర్హులుగా ప్రకటించారో చెప్పకుండా.. అర్హులందరికీ ఉచిత గ్యాస్ ఇస్తున్నట్లుగా మభ్య పెడుతున్నారు.



గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్న ఏజెన్సీ

20 రోజులు దాటినా..



ఉచిత గ్యాస్ సిలిండర్ వస్తుందని బుక్ చేసుకున్నాం. సిలిండర్ డెలివరీ సమయంలో రూ.861 చెల్లించాం. మా ఖాతాలో ఇంత వరకు డబ్బు పడలేదు. ఎందుకు పడలేదు అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదు. కొంత మందికి పడుతున్నాయి. మీకు పడకపోవడం తమకేమి తెలియదని సమాధానం చెబుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పి తప్పించుకుంటున్నారు.
– వెంకట సుబ్బమ్మ, జమ్మలమడుగు

పని చేసుకుని జీవనం సాగిస్తున్నాం



మేము పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్నాను. డెలివరీ సమయంలో డబ్బులు కట్టి సిలిండర్‌ను తీసుకున్నా. నెల రోజులు దాటినా మాకు డబ్బు పడలేదు. ఏమని గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి అడిగితే సరైన సమాధానం రాలేదు. ఈకేవైసీ కూడా చేయించుకున్నాం. అన్ని చేసినా డబ్బులు మా ఖాతాలో జమ కాలేదు.
– జ్యోతి మేరీ, ఎస్సీజీ క్వార్టర్స్, జమ్మలమడుగు

రమణీయం.. రథోత్సవం

- ముగిసిన ఆరాధన మహోత్సవాలు
- కాశినాయన జ్యోతిని చూసి తరించిన భక్తులు





భక్తజనం మధ్య కాశినాయన రథోత్సవం (ఇన్‌సెట్) ఆకాశంలో కనిపిస్తున్న జ్యోతి

కాశినాయన : అవధూత శ్రీ కాశినాయన 29వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కాశినాయన సమాధిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కాశినాయన సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం అర్ధరాత్రి 12-30 గంటలకు కాశినాయన జ్యోతిస్వరూపం దర్శనమిచ్చింది. ఆకాశంలో కాశినాయన జ్యోతిని చూసి భక్తులు తరించారు. అనంతరం కాశినాయన ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు ప్రమిదలతో దీపాలను వెలిగించుకుని గ్రామోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాశినాయన మాల ధరించిన భక్తులు దివిటీలు చేతబూని రథోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆరాధన మహోత్సవాలకు 150 క్వింటాళ్లకు పైగా బియ్యం ఖర్చు కాగా అంతకు రెట్టింపు బియ్యాన్ని భక్తులు సమర్పించారు. అధిక మొత్తంలో నగదును కూడా సమర్పించుకున్నారు. గ్రామోత్సవం అనంతరం కాశినాయన విగ్రహానికి పవళింపుసేవ నిర్వహించారు. ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సజావుగా ఆరాధన ముగిసిందని ఆలయ కమిటీ తెలిపింది.

ముస్లింల అణచివేతను ప్రతిఘటిస్తాం



వేదికపై అతిథులు, నిర్వాహకులు, నేతలు

- మౌలానా సయ్యద్ అర్షద్ మదిని సాహెబ్
- వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం
- బీజేపీ తీరుపై మండిపాటు
- బహిరంగ సభకు భారీగా జనం

గౌరవ పూర్వకంగా..
సభ కోసం విచ్చేసిన జమా అతె ఇస్లామి యే హింద్ నేత మౌలానా సయ్యద్ అర్షద్ మదని సాహెబ్‌ను జిల్లా నేతలు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎమ్మెల్సీ షరీఫ్‌తోపాటు పలువురు పీఠాధిపతులు, మత పెద్దలు కూడా ఆయనను కలిశారు.

కడప కల్చరల్ : ముస్లింల అణచివేతను అడ్డుకుంటామని జమా అతె ఉలేమా-యే-హింద్ జాతీయ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదిని సాహెబ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి కడప నగర శివారులోని జయరాజ గార్డెన్స్ ఆవరణలోని మైదానంలో జమి అతె ఉలేమా యే హింద్ ఆధ్వర్యాన భారీ బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు సృష్టిస్తూ ముస్లింలను తీవ్ర అశాంతికి గురి చేస్తోందని ఆరోపించారు. ఇది ముస్లింల ఐక్యత, పట్టుదలను బలహీన పరచలేదని పేర్కొన్నారు. ముస్లింలు కూడా ఈ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించారని, ఈ దేశాన్ని ఎంతో ప్రేమిస్తున్నారని, ఇక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఆస్తులను కాజేసే కుట్ర
వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు పేరుతో ముస్లింల ఆస్తులను కాజేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. వక్ఫ్‌బోర్డులోని 11 మంది సభ్యుల్లో ఏడుగురు ముస్లిమేతరులను నియమించాలని కేంద్రం యోచిస్తుండటం దుర్మార్గమన్నారు. ఈ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అనుమతించబోమని చెప్పారు. దీనికోసం ఎందాకైనా పోరాడుతామని హెచ్చరించారు. వక్ఫ్ ఆస్తులను కోర్టుల వరకు లాగుతుండడం బాధాకరమన్నారు. ముస్లింల అణచివేతే ధ్యేయంగా తీసుకు రావాలనుకుంటున్న ఏ చట్టాన్ని కూడా తాము ప్రతిఘటించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉన్న పార్టీలలో ముస్లింల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకున్న పార్టీగా కాంగ్రెస్ మాత్రమే కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. కోర్టుల ద్వారా ముస్లింలను ఈ దేశంలో లేకుండా చేసే వ్యర్థ ప్రయత్నాలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన పాలస్తీనా, ఇజ్రాయిల్ అంశాలను ప్రస్తావిస్తూ ఈ అంశంలో అమెరికా చర్యలను విమర్శించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేసి సభ నుంచి ఆమోదం పొందారు.

రాష్ట్రం నలుమూలల నుంచి..
భారీ స్థాయిలో సభ జరుగుతోందని విస్తృతంగా ప్రచారం జరగడంతో.. రాష్ట్రం నలుమూలల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సభాస్థలికి చేరుకున్నారు. దీంతో సభకు వచ్చే దారులన్నీ రద్దీగా మారాయి. సభ సమయానికి ఆ ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు ముస్లిం యువకులు సహకారాన్ని అందించారు. మంచినీరు, స్నాక్స్ అందజేశారు. ఈ స్థాయి బహిరంగసభ నిర్వహించడం ఇదే తొలిసారి అయినా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడం విశేషం. సంస్థ ప్రతినిధులు, స్థానిక ముస్లిం పెద్దలు వారం రోజులుగా సభా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభకు వచ్చిన వారి కోసం ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.



బహిరంగ సభలో పెద్ద ఎత్తున పాల్గొన్న ముస్లింలు



నగర శివారులోని రాయచోటి-కడప రోడ్డు మార్గం నుంచి తరలి వస్తున్న ముస్లింలు

మెరిసిన క్రీడా ఆణిముత్యం

జిల్లా నుంచి మరో క్రీడా ఆణిముత్యం జాతీయ స్థాయిలో మెరిసింది. క్రీడల్లో రారాజుగా వెలుగుతున్న క్రికెట్‌లో సత్తా చాటింది. ఉమెన్ ప్రీమియర్ లీగ్‌కు ఎంపికైంది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రూ.55 లక్షలు వెచ్చించి ఆమెను కొనుగోలు చేసింది. ఆకాశమే హద్దుగా క్రికెట్‌లో దూసుకువస్తున్న ధ్రువతార శ్రీచరణిపై ప్రత్యేక కథనం.

- ఉమెన్ ప్రీమియర్ లీగ్‌కు ఎంపిక
- రూ.55 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు



కడప స్పోర్ట్స్ : వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండలం ఆర్‌టీపీపీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.రేణుక దంపతుల కుమార్తె శ్రీచరణి మహిళల క్రికెట్‌లో రాణిస్తోంది. తాజాగా ఉమెన్ ప్రీమియర్ లీగ్‌కు సంబంధించి ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఎంపికైంది. ఢిల్లీ క్యాపిటల్ ఫ్రాంచైజీ రూ.55 లక్షలు వెచ్చించి జట్టు సభ్యురాలుగా కొనుగోలు చేసింది. దీంతో జిల్లా నుంచి ఉమెన్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో పాల్గొంటున్న తొలి మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. కాగా 2021లో బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్ అండర్-19 చాలెంజర్ ట్రోఫీలో రాణించడంతో పాటు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2018లో క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఈమె లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్‌గా, బ్యాట్స్‌ఉమన్‌గా సత్తా చాటుతోంది.

సీఏవైడీ హర్షం : ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు శ్రీచరణి ఎంపిక కావడంపై క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భరత్ రెడ్డి, ఎ.రెడ్డిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు 22 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్ : భూ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సోమవారం 22 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నది. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని అట్లూరు, బి.కోడూరు మండలం వెంకటాపురం, బి.మఠం మండలం సోమిరెడ్డిపల్లె, బద్వేలు మండలం రాజుపాలెం, గోపవరం మండలం మడకలవారిపల్లి, కలసపాడు మండలం సంకవరం, మైదుకురు మండలం ఎస్.మైదుకూరు, పోరుమామిళ్ల మండలం ఎల్లోపల్లె, పులివెందుల డివిజన్‌లోని పులివెందుల మండలం చిన్న రంగాపురం, వీఎన్ పల్లి మండలం కొమ్మద్ది, జమ్మలమడుగు డివిజన్‌లోని రాజుపాలెం మండలం టంగటూరు, మైలవరం మండలం దన్నవాడ, కొండాపురం మండలం ఎర్రగుడి, జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లి, కడప డివిజన్‌లోని పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు, వల్లూరు మండలం కుమారునిపల్లి, కడప మండలం పాలెంపల్లి, ఖాజీపేట మండలం పాటూరు, ఒంటిమిట్ట మండలం గంగపేరూరు, చింతకొమ్మదిన్నె మండలం చిన్నకాంపల్లె, కమలాపురం మండలం గంగవరం, విభరాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా


బోల్తాపడిన గ్యాస్ సిలిండర్ల లారీ

కొండాపురం : మండల పరిధిలోని ఏటూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిలో శనివారం రాత్రి గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా పడింది. అనంతపురం నుంచి ఒంగోలు వెళుతున్న లారీ బోల్తా పటడంతో డ్రైవర్ వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జాతీయ రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువ ఉన్నప్పటికి ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

అథ్లెటిక్స్ మీట్‌లో మంజుల కిరణ్‌కు బంగారు పతకం


మంజుల కిరణ్‌ను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆలిండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అథ్లెటిక్ మీట్–2024లో కడప ఆర్టీసీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మంజుల కిరణ్ 50 ఏళ్లలోపు వంద మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచారు. విశాఖపట్టణంలో ఏపీఎస్ ఆర్టీసీ ఆంధ్రప్రదేశ్, ఏఎస్ ఆర్‌టీయూ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలలో 18 రాష్ట్రాల నుంచి ఉద్యోగులు పాల్గొన్నారు. వీరిలో కడపకు చెందిన మంజుల కిరణ్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించడం అభినందనీయమని కడప ఆర్టీసీ డిపో అసోసియేషన్ నాయకులు సగినాల శ్రీనివాసులు, దాసు, వాసుదేవరెడ్డి, ఇస్మాయిల్, మురళి ,సూపర్‌వైజర్ల తరుపున లలిత, నాగమణి పేర్కొన్నారు. ఆదివారం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విఠల్, కేపీఎస్ఎం రావు పాల్గొన్నారు.

శతాధిక కవి సమ్మేళనంలో వైవీయూ అధ్యాపకుడు


డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న బండి నారాయణ స్వామి

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ మహా కవి సమ్మేళనంలో భాగంగా ఆదివారం అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో కడప యోగి వేమన విశ్వ విద్యాలయం లలిత కళల విభాగం రంగస్థల కళల అధ్యాపకుడు డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి కవితా గానం చేశారు. వైసీపీ రెడ్డి–జీవితం– సాహిత్యం గురించి 'దర్పణం' అనే శీర్షికతో కవిత్వం వినిపించారు. రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి తదితర సాహితీ వేత్తలతో సన్మానం పొందారు. వైవీయూ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథ రెడ్డి, లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావు అభినందించారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ధనుర్మాసం.. భక్తిమార్గం

- నేటి నుంచి ధనుర్మాసం
- తిరుప్పావై సేవలు ప్రారంభం
- కళకళలాడనున్న వైష్ణవాలయాలు
- నెలపాటు పాశురాల గానం


దేవుని కడప ఆలయంలోని ఆండాళ్ అమ్మవారి మందిరం

కడప కల్చరల్ : వెలుగురేఖలు విచ్చుకుంటున్న సమయం.. మంచుతెరలు ఊరిని కప్పేస్తున్న వేళ.. తెల్లవారక ముందే ఇళ్లలో గృహిణుల సందడి.. ఇళ్ల బయట కళ్లాపి చల్లి కళ్లు చెదిరే రంగుల ముగ్గులను తీర్చిదిద్దుతున్న దృశ్యాలు మాసమంతా తెల్లవారుజామునే వైష్ణవాలయాలు భక్తులు, పూజలతో సందడిగా కనిపిస్తాయి. పాశురాల గానంతో ఆలయాలు ప్రతిధ్వనిస్తాయి. మాసాలలో ధనుర్మాసాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా జిల్లాలో ధనుర్మాసం నిర్వహణ గురించిన వివరాలు.

తిరుమల తొలిగడపగా భావించే దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 4.30 గంటలకే ఆలయ ప్రాంగణంలో ఉత్తరం వైపుగల శ్రీ ఆండాళ్ అమ్మవారి మందిరంలో విశేష అభిషేకాలు, అలంకారాలు, పూజలు చేస్తారు. పొంగలిని ప్రత్యేక ప్రసాదంగా నివేదిస్తారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఒకటి చొప్పున పాశురాలను గానం చేస్తారు. మరికొన్ని వైష్ణవాలయాలలో ప్రతిరోజు 30 పాశురాలను ఆలపిస్తారు.

విశేష పూజలు

ఆలయం దక్షిణానగల ఆళ్వార్ల సన్నిధిలో పూజలు చేస్తారు. వారి పేరిట స్వామికి ప్రత్యేక పూజలు, నివేదనలు నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశికి ముందు, ఆ తర్వాత ఆళ్వార్ల పేరిట 'రాపత్తు, పగలు పత్తు' అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గోదాదేవి ప్రతిరూపమైన శ్రీ ఆండాళ్ తాయార్ అమ్మవారికి విశేష పూజలు చేసి స్వామితో సహా పారువేట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయం, ఎన్జీఓ కాలనీలోగల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, జవుళి బజారు (బీకేఎం వీధి) శ్రీ కోదండ రామాలయం, జమ్మలమడుగులోని శ్రీ నారాపురస్వామి దేవాలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయం, నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం తదితర వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జవుళి బజారు రామాలయంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేద పండితుల ఆధ్వర్యంలో పాశురాల గానం, ధనుర్మాసం విశిష్టతలపై ప్రసంగాలు ఉంటాయి.

ఈ మాసం విశిష్టత

ఈ మాసంలో సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశిస్తాడు గనుక దీనిని ధనుర్మాసంగా పేర్కొంటారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేంత వరకు ఉండే పవిత్ర మాసాన్నే ధనుర్మాసంగా వ్యవహరిస్తారు. వైష్ణవ సంప్రదాయాలలో ఈ మాసం అత్యంత పుణ్యదాయకం. ఈ మాసమంతా వైష్ణవాలయాలలో ప్రతిరోజు 4.00 గంటల నుంచి విశేష పూజలు నిర్వహిస్తారు. గోదాదేవి తన ఆరాధనను పూలమాలలుగా భావించి శ్రీనాథుడు రంగనాథునికి సమర్పించి ఆయనకు ధరింపజేయాల్సిన మాలను తానే ధరించి ఆయన కటాక్షంతో మోక్షాన్ని పొందారని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఆమెనే వైష్ణవ సంప్రదాయంలో ఆండాళ్‌గా వ్యవహరిస్తారు. ఆమె రచించిన తిరుప్పావైలోని 30 పాశురాలను ధనుర్మాసమంతా వైష్ణవాలయాలలో పారాయణం చేస్తారు. తిరుమలలో కూడా ఈ నెల రోజులు సుప్రభాతానికి బదులుగా తిరుప్పావైని పఠిస్తారు. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే పుష్యశుద్ధ ఏకాదశినే వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి అంటారు. వైకుంఠ ఏకాదశి వరకు వైకుంఠ వాసుడు శ్రీ మహా విష్ణువు యోగ నిద్రలో ఉంటాడని, వైకుంఠ ఏకాదశి రోజు మేల్కొని ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తాడని పెద్దలు తెలుపుతున్నారు. అందుకే ఆ రోజును వైకుంఠ ఏకాదశిగా పేర్కొంటారని, ఆ రోజున ప్రభాత వేళలో స్వామిని ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకోవడం ముక్తిదాయకమని చెబుతున్నారు. ఈ మాసమంతా గృహిణులు ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు పెట్టడం సంప్రదాయం.


ఆలయంలో ఆళ్వార్ల సన్నిధి

ఆశాల సమస్యలు పరిష్కరించండి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశాలకు వేతనాలు పెంచుతామని ఉద్యోగానికి భద్రత కల్పిస్తామని, ఆశాల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు రూ. 26 వేల కు పెంచాలని, రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు ఆపాలన్నారు. మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని అంతవరకు ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిచే గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి సుభాషిణి, ఎల్. శాంతి, ఏఐటీయూసీ నాయకులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కల్పన, మరియమ్మ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి.శాంతమ్మ కోశాధికారి సి.అమ్ములు ఉపాధ్యక్షులు శోభారాణి, అనసూయమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్. వెంకటసుబ్బయ్య

ఉపాధ్యాయుల శిక్షణను వాయిదా వేయాలి

యూటీఎఫ్ డిమాండ్


షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా సమ్మెటివ్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఉపాధ్యాయులకు నాయకత్వ శిక్షణా తరగతులు నిర్వహించడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు అన్నారు. ఈ శిక్షణలను ప్రభుత్వం తక్షణం వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సమ్మెటివ్ పరీక్షలు జరుగుతున్నాయని ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించడం సరికాదన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య చాలా తక్కువగా ఉందని అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులను శిక్షణా తరగతులలో నిమగ్నం చేస్తే పాఠశాలల్లో పిల్లలకు పరీక్షలు ఎవరు నిర్వహిస్తారని వారు ప్రశ్నించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో వారం రోజుల పాటు ఉపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ పేరుతో పాఠశాలలకు వారం రోజుల పాటు దూరం చేయడం వలన ఈ పనులు ఎవరు చేస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఈ అసంబద్ధ నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉద్యమాన్ని చేపడతామని, శిక్షణ తరగతులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, సుజాత రాణి, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, ఏజాస్ అహమ్మద్, ఈరి బాలజోజి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుల్ రెడ్డి, రూతు ఆరోగ్యమేరి, కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు నాలుగు నెలల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు జరుగుతాయని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం కడపలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మౌలిక వసతుల్లో మన దేశం ప్రపంచంలో ఐదో స్థానంలో ఉందన్నారు. మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత దేశం టెర్రరిజం, నక్సలిజంపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు నెలనెలా జీతాలు అందుతున్నాయన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు లక్ష్మినారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బొమ్మన విజయ్, వెంకట సుబ్బారెడ్డి, లక్ష్మణ్ రావు, బత్తల పవన్ తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

నందలూరు : మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బోధనేతర సిబ్బంది సంక్షేమమే తమ ధ్యేయమని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు శివకాంత్, అధ్యక్షుడు మనోహర్ నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్జీఓ హోంలో మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బోధనేతర సిబ్బంది సంఘం 6వ వార్షికోత్సవం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ హాజరై అప్కోస్ సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు బోధనేతర సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన గౌరవాధ్యక్షుడు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పుల్లంపేట : మండలంలోని అనంతసముద్రం పంచాయతీ బోటుమీదపల్లె గ్రామం వద్ద టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆదివారం 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

కూటమి కుట్రలు అధిగమించి విజయం


టీసీలుగా, చైర్మన్ వైస్ చైర్మన్‌లుగా గెలిచిన వారితో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులను ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా జమ్మలమడుగు నియోజకవర్గం పరిధిలో 16 టీసీలలో పోటీ చేసి 15 టీసీలను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లో మైలవరం ఆయకట్టు, చెరువుల కింద పంట సాగు చేసే రైతులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు, పోటీ చేసేందుకు నీటి పన్ను చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్లు పొందాలని అధికారులు సూచించారు. అయితే వీఆర్‌ఓలు నోడ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కూటమి నేతలు ఆంక్షలు విధించారు. దీంతో ముందుచూపు కలిగిన వైఎస్సార్‌సీపీకి చెందిన కొంత మంది నాయకులు ముందస్తుగానే వీఆర్‌లకు పన్నులు చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్లు పొందారు. మొత్తం 16 టీసీలకు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు పోటీ చేసి 15 స్థానాలను కైవసం చేసుకున్నారు. అందులో తిరుపాలదిన్నె నీటి సంఘం అధ్యక్షుడిగా ఉలవల మల్లికార్జున రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కాస వెంకటరమణారెడ్డి, వెంకటరెడ్డిలు వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు.

నియంతృత్వ పాలనను తలపిస్తోంది: ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు నియోజకవర్గంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా దేవగుడి రాజ్యాంగం నడుస్తోంది. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరులు 16 టీసీలకు పోటీ చేస్తే 15 సీట్లు గెలిచారు.. అని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పాతబస్టాండ్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన నీటి సంఘాల ఎన్నికలను అధికార పార్టీకి చెందిన నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. ఏకంగా 8మంది వీఆర్‌ఓలను ప్రైవేట్ వాహనంలో ఎత్తుకుపోయి నోడ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా చేశారన్నారు. నోడ్యూస్ సర్టిఫికెట్లు ఇచ్చి ఉంటే అధికార పార్టీపై ఉన్న రైతుల వ్యతిరేకత బహిర్గతమయ్యేదన్నారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

15 తులాల బంగారు,
రెండు కిలోల వెండి సామగ్రితోపాటు
రూ.4.50 లక్షల నగదు అపహరణ


చోరీ జరిగిన ఇంటిలో బాధితుడిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న చిన్నచౌక్ ఎస్ఐ

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీకృష్ణ దేవరాయకాలనీలో రాజశేఖర్ అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగింది. రాజశేఖర్, అతని భార్యతో కలిసి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పాత టీడీపీ కార్యాలయం భవనంలో ప్లేస్కూల్ నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణాలను చేపడుతుంటారు. బాధితుడి ఫిర్యాదు వీరు శని, ఆదివారాలు సెలవుకావడంతో తమ స్వగ్రామమైన చక్రాయపేటకు వెళ్లారు. తరువాత ఆదివారం మధ్యాహ్నం రావాల్సి ఉంది. కానీ ఆదివారం ఉదయం ఎదురింటివారు ఫోన్ చేసి ఇంటిలో లైట్లు వెలుగుతున్నాయని, బయట వాకిలి తెరిచి ఉందని చెప్పారు. వెంటనే బాధితుడు హుటాహుటిన బయలుదేరి వచ్చారు. ఇంటికి వచ్చి చూస్తే తలుపునకున్న తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంటిలోని బెడ్‌రూంలో ఉన్న బీరువాను పగులగొట్టి అందులోని 15 తులాల బంగారు ఆభరణాలను, రెండు కిలోల వెండి ఆభరణాలను, రూ. 4.50 లక్షల నగదును అపహరించుకుని వెళ్లిపోయారు. సంఘటన స్థలాన్ని చిన్నచౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, క్లూస్ టీం వారు వచ్చి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నచౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చోరీలు జరగకుండా స్థానికంగా ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఊళ్లకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలను తమ ఇళ్లలో అమర్చుకోవాలని సూచించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు


రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

వీరపునాయునిపల్లె : కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. కడప జిల్లాకు చెందిన ఎద్దులే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా వచ్చాయి. పోటీలను తిలకించేందుకు జిల్లాలోని నలు మూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. బండ లాగుడు పోటీలను ఆలయ ధర్మకర్త కటికం లక్ష్మిరెడ్డి ప్రారంభించారు. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజశ్రీ రెడ్డి ఎద్దులు మొదటి స్థానం, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్శల వెంకటసాయి భవిత్‌రెడ్డి ఎద్దులు రెండవ స్థానం, వైఎస్సార్ జిల్లా ఓబులంపల్లెకు చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి ఎద్దులు మూడో స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా అనగలూరుకు చెందిన వంశీరెడ్డి ఎద్దులు నాలుగో స్థానం, వైఎస్సార్ జిల్లా బాలయ్యగారిపల్లె విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దులు ఐదో స్థానం, ప్రకాశం జిల్లా వినుకొండ చిన్నబాయి యాదవ్ ఎద్దులు ఆరవ స్థానం, కడప తిప్పిరెడ్డిపల్లె మనోహర్‌రెడ్డి ఎద్దులు ఏడవ స్థానం, కడప జిల్లా ఖాదర్‌ఖాన్ కొట్టాలకు చెందిన భావనశ్రీ ఎద్దులు ఎనిమిదో స్థానం పొందాయి.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి


విజేతలతో వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి

ప్రొద్దుటూరు : గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పద్మ పేర్కొన్నారు. వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండో రోజు ఇంటర్ కాలేజియేట్ ఫేజ్–2 క్రీడా పోటీల ముగింపు సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం క్రీడా సాధన చేస్తూ ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్ బహూకరించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి, ప్రొఫెసర్లు కేవీ రమణయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

పురుషుల విభాగం వాలిబాల్‌లో ఆర్‌సీపీఈ (ప్రొద్దుటూరు), సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కాలేజి (కమలాపురం), ఎన్‌సీపీఈ (బద్వేలు), టగ్ ఆఫ్ వార్ పోటీలో వైవీయూ (కడప), వైఎస్సార్‌ఈసీ (ప్రొద్దుటూరు), ఆర్‌సీపీఈ (ప్రొద్దుటూరు), కబడ్డీలో ఆర్‌సీపీఈ (ప్రొద్దుటూరు), వైఎస్సార్‌ఈసీ(ప్రొద్దుటూరు), ఎస్‌సీఎస్‌డీసీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో వాలీబాల్ పోటీలో ఆర్‌సీపీఈ (ప్రొద్దుటూరు), వైఎస్సార్‌ఈసీ (ప్రొద్దుటూరు), వైవీయూ (కడప), టగ్‌ఆఫ్ వార్ పోటీలో ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ (కడప), వైవీయూ(కడప), వైఎస్సార్‌ఈసీ (ప్రొద్దుటూరు), కబడ్డీ పోటీలో ఆర్‌సీపీఈ (ప్రొద్దుటూరు), వైవీయూ (కడప), వైఎస్సార్‌ఈసీ (ప్రొద్దుటూరు) కాలేజీలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

ప్రమాదంలో మౌలిక మానవ విలువలు

హక్కుల ఉద్యమ నేత
ప్రొఫెసర్ హరగోపాల్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కడప సెవెన్‌రోడ్స్ : స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మౌలిక మానవ విలువలు నేడు ప్రమాదంలో పడ్డాయని ప్రముఖ పౌరహక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మృతిలో... చట్టం అందరికీ సమానమేనా అనే అంశంపై వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కడప హరిత హోటల్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనా? అనేది ఒక మౌలిక ప్రశ్న అన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత ఈ ప్రజాస్వామ్యం నిలుస్తుందా, మనం ఏం చేయాలనే ప్రశ్న పౌరసమాజం నుంచి వస్తోందన్నారు. అమెరికా రాజ్యాంగం రాసుకునే సమయంలో ఆయుధాలపై రాజ్యానికే అధికారం ఉండాలనే వాదనను అందరూ వ్యతిరేకించారన్నారు. ఆయుధాన్ని కలిగి ఉండే హక్కు ప్రజలకు ఇచ్చారని, చట్ట పరిమితుల్లో వాటిని ఉపయోగించుకోవాల్సి ఉంటుందన్నారు. మన దేశంలో అన్నీ రాజ్యం చేతికి ఇచ్చిన తర్వాత మన హక్కులను రాజ్యం హరిస్తోందన్నారు. ఇందుకు ప్రొఫెసర్ సాయిబాబాకు జరిగిన అన్యాయమే నిదర్శనమన్నారు. ఆదివాసీల కోసం పనిచేస్తున్న ఆయనను అకారణంగా పదేళ్లు జైలులో పెట్టారని తెలిపారు. పోలియో వల్ల ఆయన రెండు కాళ్లు పని చేయకపోయినా చేతులతో నడిచేవారని తెలిపారు. జైలులో ఆయనను టాయిలెట్‌కు తీసుకెళ్లేందుకు పోలీసులు చేతులు పట్టి లాక్కెళ్లేవారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఈ విషయాన్ని వివరించడంతో మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ జోక్యం చేసుకున్నప్పటికీ పోలీసుల తీరు మారలేదని చెప్పారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో రాజ్యాంగంపై పరిశోధన చేసిన జస్టిస్ చంద్రచూడ్ సుప్రీం కోర్టు జడ్జిగా ఉన్నప్పుడు డిసెంట్ నోట్ ఇచ్చారని, ఆయన భారత ప్రధాన న్యాయమూర్తి అయ్యాక సాయిబాబా బెయిల్ రద్దు చేయడం ఆశ్చర్యకరమన్నారు. భిన్నమైన విశ్వాసాలు, వాటి మధ్య ఘర్షణ ఉండడం సమాజంలో సహజమేనన్నారు. అలా కాకుండా దేశమంతా ఒకే విశ్వాసం ఉండాలనడం తగదన్నారు. అమెరికా పౌరసత్వం వదులుకుని ఆదివాసీల కోసం పనిచేసేందుకు వచ్చిన సుధా భరద్వాజ్‌ను జైలుపాలు చేశారని విమర్శించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపడుతున్న నాయకులు రాజ్యాంగ విలువలను కాపాడటం లేదని చెప్పారు. చట్టాన్ని అమలు చేసేవారు మంచివారు కాకపోతే చట్టం ఎంత మంచిదైనా ప్రయోజనం ఉండదన్నారు. ఖనిజ సంపద కార్పొరేట్ సంస్థలకు కట్టబెడతామని అడ్డం వస్తే ఎవరినీ సహించబోమంటూ సాక్షాత్తు ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి ఎకనమిక్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనడం విచారకరమన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసం అందరూ ముందుకు రావాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సాయిబాబాను పదేళ్లు జైలులో ఉంచినా నేరం రుజువు కాలేదని, అందుకు ఆయనకు ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వలేదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక జర్నలిస్టు దళిత మహిళపై అత్యాచారం, హత్యకు సంబంధించిన వార్త రాయగా, ఆయనను 712 రోజులు జైలులో ఉంచారని చెప్పారు. బ్రిటీషు పాలనలో 317 మందిపై రాజద్రోహ నేరం కేసు పెట్టగా మోదీ పాలనలో 548 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. ఆర్‌సీపీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ చట్టం పేద వాళ్లకు కాకుండా పెద్ద వాళ్లకే ఉపయోగపడుతోందన్నారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రిటైర్డ్ అధికారి గుర్రాల గోపాల్, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్, డాక్టర్ రాజా వెంగళరెడ్డి, డాక్టర్ ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా సెక్రెటరీ చెప్పాలి రాజారావు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్‌కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా సెక్రెటరీ చెప్పాలి రాజారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆరు నెలలైనా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇస్తామని మధ్యంతర భృతి పెండింగ్ బకాయిలన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. 2023 జూలై నుంచి ఉద్యోగులకు పీఆర్సీ అమలులోకి తెస్తామని ప్రకటించి ఏడాదిన్నర దాటినా కార్యరూపం దాల్చలేదన్నారు. పీఆర్సీ కమిషన్ రాజీనామా చేసి నాలుగు నెలలైనా మళ్లీ నియమించలేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వారి ఫైనల్ పేమెంట్ కూడా చెల్లించాలన్నారు.